# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 106 | పేజీలు : 08 | గురువారం | 23-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## దేశం మొత్తాన్ని కలిచివేసింది




పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసిందన్న ప్రధాని నరేంద్రమోదీ

పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది

ఎక్స్ వేదికగా నివాళులర్పించిన ప్రధాని మోదీ

ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎప్పటికీ మరిచిపోలేమన్న మోదీ

హైదరాబాద్ పల్స్,డెస్క్

పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈ విషాదాన్ని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారిని ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.గత సంవత్సరం ఇదే రోజున పహల్గామ్‌లో దారుణమైన ఉగ్రదాడి జరిగిందని,... తరువాయి 2 లో

## ఉదయం నుంచి సమ్మె






కొనసాగిస్తున్న ఆర్టీసీ కార్మికులు,ప్రయాణికుల తీవ్ర అవస్థలు

ఆర్టీసీ సమ్మె వల్ల తెలంగాణ వ్యాప్తంగా ప్రయాణికుల అవస్థలు

1000 బస్సులను అద్దె, ఔట్ సోర్సింగ్ విధానంలో సిద్ధం చేసిన అధికారులు

పొరుగు సేవల పద్ధతిలో నడపేటట్లుగా నిర్ణయం

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె దిగారు. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో డిపోల్లోనే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు పలుచోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా మరికొన్ని చోట్ల ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ అద్దె బస్సులు నడుపింది. చాలా ప్రాంతాల్లో మగవారి నుంచి టికెట్ తీసుకోకుండా బస్సుల్లో ఎక్కించుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు రోడ్డు ఎక్కలేదు. సీనియర్ ఐఏఎస్ ల కమిటీతో ఆర్ టీసీ జేఏసీ జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. బస్సులు నిలిపేసి అన్ని డిపోల ముందు నిరసన

## కుట్రలు కూలిపోయాయి



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హైకోర్టు తీర్పు.. స్పందించిన కేటీఆర్

ఈ తీర్పు ద్వారా కాంగ్రెస్ కుట్రలు కూలిపోయాయన్న కేటీఆర్

హైకోర్టు తీర్పుతో తెలంగాణ ప్రజలు గెలిచారన్న కేటీఆర్

భూమిపై గోదావరి పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని వ్యాఖ్య

విద్యా రంగంలో సంస్కరణల జోరు.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సమూల మార్పులు

## సమ్మె పరిష్కారం కాదు.. విధుల్లో చేరండి

ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి



ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడి

నాలుగు వారాల్లో కమిటీ నివేదిక సమర్పిస్తుందని మంత్రి పొన్నం హామీ

32 డిమాండ్లలో 29 సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టీకరణ


సమ్మె వల్ల సామాన్య ప్రజలు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడతారని ఆవేదన

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్‌టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని, ప్రజా సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ఏ

## కాళేశ్వరం కేసు..

కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట



కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశం

విచారణ కమిషన్ చట్టంలోని నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టీకరణ

కేసీఆర్, హరీశ్‌తో పాటు ఇద్దరు ఐఏఎస్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు తీర్పు

కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నా, నివేదిక ఆధారంగా చర్యలు చెల్లవని వ్యాఖ్య

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్..... తరువాయి 2 లో



## నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత..

మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత.. నాదెండ్ల రాజకీయ ప్రస్థానం ఇదే!

అనారోగ్య, వృద్ధాప్య సమస్యలతో నాదెండ్ల కన్నుమూత

హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో కన్నుమూత

నేడు సాయంత్రం 4 గంటలకు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు

1984లో నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల

నాదెండ్ల వయసు 90 సంవత్సరాలు

## చివరకు న్యాయమే గెలిచింది

హైకోర్టు తీర్పుపై హరీశ్ రావు



కాంగ్రెస్ రాజకీయ కుట్రలు బట్టబయలు.. చివరకు న్యాయమే గెలిచిందన్న హరీశ్ రావు

ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు వద్దని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

కేసీఆర్, హరీశ్ రావులకు తెలంగాణ హైకోర్టులో ఊరట

ఇది కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందన్న హరీశ్ రావు

కక్షసాధింపులు మాని రైతుల ప్రయోజనాలు కాపాడాలని ప్రభుత్వానికి హరీశ్ సూచన

## బీజేపీ - బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం



కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు సాంకేతికపరమైన అంశాలకే పరిమితమన్న మహేశ్ గౌడ్

కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని వ్యాఖ్య

బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనన్న పీసీసీ అధ్యక్షుడు



## ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

కాళేశ్వరం విచారణ..హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

పీసీ ఘోష్ కమిషన్ ను హైకోర్టు తప్పుబట్టలేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

మేడిగడ్డ సహా మూడు బ్యారేజీలలో లోపాలు ఉన్నాయని కమిషన్ స్పష్టంగా చెప్పిందని వ్యాఖ్య

కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించిందన్న మంత్రి

# దేశం మొత్తాన్ని కలిచివేసింది

మొదటి పేజీ తరువాయి

అమాయకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు, బంధువులకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలో దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎన్నటికీ సఫలం కావని పేర్కొన్నారు. కాగా, గత సంవత్సరం ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.

# చివరకు న్యాయమే గెలిచింది

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. “ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయస్థానాల్లో న్యాయమే గెలుస్తుందని, సత్యమే నిలుస్తుందని మరోసారి రుజువైంది” అని ఆయన అన్నారు. కేసీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు మాజీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. విచారణ కమిషన్ చట్టంలోని నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరించి జరిపిన విచారణను హైకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన వివరించారు. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాటకాలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ బురదజల్లుడు ఆపి, దెబ్బతిన్న పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 2025 జులై 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, కేసీఆర్, హరీశ్ రావులను బాధ్యులుగా పేర్కొన్న విషయం తెలిసిందే.

# సమ్మె పరిష్కారం కాదు.. విధుల్లో చేరండి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని, ప్రజా సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలన చేస్తోందని, నాలుగు వారాల్లో నివేదిక వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థను, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు సమ్మెను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇది కాలయాపన చేసే వ్యూహం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, వాటిని వెంటనే పరిష్కరించవచ్చని తెలిపారు. మిగిలిన ఆర్టీసీ విలీనం, యూనియన్ల గుర్తింపు వంటి అంశాలు సాంకేతిక పరమైనవని, వీటిపై లోతైన పరిశీలన అవసరమని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీతో పాటు బకాయిపడ్డ డీఏలను, 2013 నాటి బాండ్లను సైతం పరిష్కరించినట్లు తెలిపారు. రూ.1,205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్లుగా ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామన్నారు. పీఎఫ్, సీసీఎస్ కోసం ప్రతినెలా రూ.75 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. పని భారం తగ్గించేందుకు త్వరలోనే 4,538 మంది ఉద్యోగుల నియామకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 1,134 కారుణ్య నియామకాలు చేపట్టామని, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రస్తుతం కోలుకుంటోందని, ఈ దశలో సమ్మె చేయడం సంస్థకు, ప్రజలకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీపై ఆధారపడి ఉన్నారని, వీరిలో 45 లక్షల మంది మహిళలేనని గుర్తుచేశారు. పేద ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను భరించలేరని, కాబట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే విధుల్లో చేరాలని కోరారు.

## నాదెండ్ల భాస్కరరావు

# కన్నుమూత..

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్న నాదెండ్ల...తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడే ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆయన అంత్యక్రియలను పంజాగుట్ట శ్మశానవాటికలో నేడు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల మృతి పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన... 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరారు. 1984లో చికిత్స కోసం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన సమయంలో... కొంత మంది ఎమ్మెల్యేల మద్దతులో నాదెండ్ల సీఎం అయ్యారు. నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల... ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించారు.

# కాళేశ్వరం కేసు..

మొదటి పేజీ తరువాయి

అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్, హరీశ్ రావు సహా అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నలుగురు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## బీజేపీ - బీఆర్ఎస్ మధ్య

# రహస్య ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్పు కేవలం సాంకేతికపరమైన అంశాలకే పరిమితమని, అవినీతి జరగలేదని కోర్టు ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. కోర్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను కానీ, దాని విచారణను కానీ తప్పుబట్టలేదని... కేవలం నివేదిక రూపకల్పనలో అనుసరించిన విధానాన్ని మాత్రమే ప్రశ్నించిందని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని, బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. గతంలో ప్రధాని మోదీ, అమిత్ షా వంటి నేతలు కాళేశ్వరంను ‘ఏటీఎం’తో పోల్చారని గుర్తు చేస్తూ... కాళేశ్వరం అంశంపై ఇప్పుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం వల్లే ఈ కుంభకోణంపై కేంద్రం మౌనంగా ఉందని ఆయన ఆరోపించారు.

# ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న కేసీఆర్, హరీశ్ రావు, కొందరు అధికారులపై తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ తీర్పును బీఆర్ఎస్ నేతలు క్లీన్ చిట్‌గా భావించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు ఎక్కడా పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును తప్పుబట్టలేదని, దాని నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని మంత్రి గుర్తు చేశారు. మేడిగడ్డ సహా మూడు బ్యారేజీలలో లోపాలు ఉన్నాయని కమిషన్ స్పష్టంగా చెప్పిందని, ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయన్న వాస్తవంలో మార్పు లేదని తెలిపారు. హైకోర్టు తీర్పుపై రేపు జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత ప్రభుత్వం తన తదుపరి అడుగులను ప్రకటిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# ఉదయం నుంచి సమ్మె

మొదటి పేజీ తరువాయి

చేపట్టారు. సమ్మెలో భాగంగా హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఆర్టీసీ జేఏసీ నాయకులు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పరిష్కరించకుంటే మరో సకల జనుల సమ్మెకు సిద్ధమవుతామని ఆర్టీసీ ఐకాస నేతలు స్పష్టంచేశారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లోనూ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కార్మికుల సమ్మెతో జూబ్లీ బస్ స్టేషన్‌లో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. పికెట్, కంటోన్మెంట్, రాణిగంజ్ డిపోలలో బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉత్తర తెలంగాణకు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెదక్ డిపో ముందు బైఠాయించి సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు పక్కకు తరలించి పటాన్‌చెరుకు ఓ బస్సు పంపించడంతో కార్మికులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. సంగారెడ్డిలో ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు సమయానికి పరీక్షలకు వెళ్లలేక పోయామని చెప్పారు. కొందరు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రులకు సైతం వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెతో మంచిర్యాల డిపో అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా కండక్టర్ లేకుండానే ప్రైవేట్ సిబ్బందితో ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సమ్మె ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. ఆరు డిపోల పరిధిలో విధులు బహిష్కరించిన కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో జేఏసీ పిలుపుతో కార్మికులు సమ్మెకు దిగారు. ఆర్టీసీ కార్మికులకు ఈ పరిస్థితి రావటం బాధాకరమని ఏ కార్మికుడు కూడా సమ్మెకు వెళ్లాలని అనుకోరని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి తెలిపారు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు జగిత్యాల డిపోలో ఆయన సంఘీభావం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ సమ్మె కొనసాగింది. జిల్లావ్యాప?తంగా 600 కుపైగా బస్సులు డిపోలకే పరిమితమైయ్యాయి. ఖమ్మంలో సమ్మె సంపూర్ణంగా కొనసాగింది. కార్మికులు బస్సులను నిలిపి తెల్లవారుజాము నుంచే డిపోల ఎదుట ఆందోళన చేశారు. రీజియన్‌లోని 7 డిపోలకు చెందిన 608 బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 7 డిపోల్లో బస్సులు పాక్షికంగా నడిచాయి. జిల్లాలో 180కి పైగా ఉన్న ఎలక్ట్రిక్, ప్రైవేటు బస్సులు ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేర్చాయి. సూర్యాపేట జిల్లా కోదాడ బస్ డిపో ఎదుట కార్మికులు సమ్మెకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. సమ్మెకు పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కార్మిక వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం పంతాలు పట్టింపులకు సామాన్యులు బలయ్యే ప్రమాదముందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే ప్రభుత్వంలో విలీనం చేయడం లేదని ఆరోపించారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్లో మెట్రో సర్వీసులను పెంచారు. సమ్మె కాలంలో 56 అదనపు మెట్రో రైళ్లు నడుపుతోంది. మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో 4 నిమిషాల 20 సెకన్లకో మెట్రో ట్రైన్, నాగోల్-రాయదుర్గం మార్గంలో 3 నిమిషాల 40 సెకన్లకో మెట్రో ట్రైన్ తిరుగుతున్నాయని సంస్థ ప్రకటించింది.

# కుట్రలు కూలిపోయాయి

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనిపించేలా హైకోర్టు తీర్పు వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పు ద్వారా కూలింది కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలు అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుతో ఈరోజు గెలిచింది తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు అన్నారు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు తెలంగాణలో పారుతున్న ప్రతి నీటిబొట్టు కేసీఆర్ చేసిన కృషివల్లే వచ్చిందని అన్నారు. తెలంగాణ భూమిపై గోదావరి పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అందరికీ అసలు విషయం తెలిసిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కచ్చితంగా వరప్రదాయిని అన్నారు. రూ.94 వేల కోట్లు ఖర్చయితే రూ.1 లక్ష కోట్లు అని ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదని, మూడు బ్యారేజీలు అని తెలిపారు. కాంగ్రెస్ చేసిన కుట్రల వల్ల మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని ఆరోపించారు. రాష్ట్రంలో చెక్ డ్యాంలు బాంబులు పెట్టి పేలుస్తుంటే కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు.

# విద్యా రంగంలో సంస్కరణల జోరు.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సమూల మార్పులు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ఏప్రిల్ 22 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేస్తూ, అద్భుతమైన ఫలితాలను సాధిస్తోంది. అక్షరాస్యత పెంపు నుంచి బోధనా నాణ్యత వరకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలంగాణ విద్యా వ్యవస్థలో కొత్త విప్లవానికి నాంది పలికాయి. గతంలో నిర్లక్ష్యానికి గురైన వయోజన విద్యకు రేవంత్‌రెడ్డి సర్కార్ కొత్త ఊపిరి పోసింది. రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని వందకు వందశాతం పెంచడమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ ముందుకు సాగుతోంది. తాజాగా నిర్వహించిన అక్షరాస్యత పరీక్షలకు ఏకంగా 6.31 లక్షల మంది వయోజనులు హాజరుకావడం ఒక రికార్డు. పెద్దల చదువుకు పెద్దపీట వేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, అవి వారికి ఎంతవరకు అర్థమవుతున్నాయనే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పెద్దపల్లి జిల్లాలోని 61 పాఠశాలల్లో ‘అకడమిక్ ఇన్‌స్పెక్షన్ టీమ్స్’ ద్వారా ప్రత్యేక బోధనా పద్ధతులను అమలు చేశారు. కేవలం ఆరునెలల్లోనే బోధన నాణ్యతలో గణనీయమైన మార్పులు వచ్చాయి. బోధన వ్యూహాలు 48శాతం నుంచి 68శాతానికి మెరుగయ్యాయి. తరగతి గదుల నిర్వహణ, విద్యా వనరుల వినియోగంలో ఉపాధ్యాయులు స్పష్టమైన పురోగతి సాధించారు. పునాది విద్య గట్టిగా ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందని భావించిన ప్రభుత్వం, ప్రాథమిక స్థాయిలో అభ్యాస నైపుణ్యాలను పెంచింది. తెలుగులో 35శాతం, ఇంగ్లీష్‌లో 29శాతం, ఉర్దూలో 40శాతం అభ్యాస వృద్ధి నమోదైంది. విద్యార్థుల గణిత నైపుణ్యాల్లో 30శాతం వరకు పెరుగుదల కనిపించింది. కేంద్రం ప్రభుత్వం అందించే సమగ్ర శిక్ష నిధులను వినియోగించుకోవడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 84శాతం నిధులను విద్యారంగం కోసం ఖర్చు చేసింది. విద్య కోసం కేటాయించిన ప్రతి రూపాయిని సద్వినియోగం చేస్తూ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మెరుగైన వసతులు కల్పిస్తోంది. రాష్ట్ర భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మిస్తుందనే నినాదంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తోంది. అక్షరాస్యతలో అగ్రస్థానం, నాణ్యమైన బోధన, నిధుల పారదర్శక వినియోగంతో తెలంగాణ విద్యా రంగం నేడు దేశానికే ఒక ఆదర్శ నమూనాగా నిలుస్తోంది.

# ప్రకాష్ రాజ్ హిందూ లోకానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామంలో సమావేశంలో పరశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ మాట్లాడుతూ ఇటీవల ప్రకాష్ రాజ్ రామాయణం మీద చేసినటువంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిచారు. హిందువులు ఆరాధ్య దైవంగా భావించేటటువంటి రామలక్ష్మణులను దొంగలుగా చిత్రీకరించడం అనేది చాలా బాధాకరమైన విషయం అని, అదే టైంలో రావణాసురుడిని గొప్పగా చిత్రీకరించడం, ఇటువంటి హిందూ వ్యతిరేకులు, మూర్ఖులు ఉన్నంతకాలం భారతదేశంలో అల్లర్లు జరుగుతూనే ఉంటాయి అని, ఇలాంటివారు హిందువుల మీద రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతూ ఉంటారు అని, ఈ సందర్భంగా ఒకటి చెప్పదలుచుకున్నాను రాముల వారి జోలికి వచ్చినటువంటి ఏ వ్యక్తి కూడా బాగుపడినట్లు చరిత్రలో లేదు అని, ఎందుకంటే ఈ గత పది సంవత్సరాల నుండి కూడా రాముల వారి మీద నోరు పారేసుకున్నా ప్రతి ఒక్కడు కూడా కుక్క చావు చచ్చాడు అని, ఇప్పుడు రామలక్ష్మణులకు దొంగలుగా చిత్రీకరించినటువంటి వ్యక్తి ఎవరైతే ఉన్నారో, ఈ ఘనుడు పొరుగు రాష్ట్రం నుండి ఇక్కడ కు వచ్చి, తెలుగు ఇండస్ట్రీలో ఏలుతున్నాడు కదా మరి ఇలాంటి వాడిని కూడా దొంగ గానే చిత్రికరించాలా మరి ఇతగాడిని ఏమంటారు. ప్రకాష్ రాజుకు మా పరశురాం పరివార్ హిందూ సంస్థ నుండి ఒకటే చెబుతున్నాం చరిత్ర తెలియకుంటే చదివి తెలుసుకో, అంతేకానీ నోటికి ఎంత వస్తే అంత మాట్లాడడం కరెక్ట్ కాదు, నోరు అదుపులో పెట్టుకో అని హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తుల మీద సినిమా ఇండస్ట్రీ కూడా తప్పకుండా చర్యలు తీసుకొని ఇలాంటి వ్యక్తిని సినిమా ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలని, మన హిందువులు కూడా ఇలాంటి వ్యక్తి సినిమాలు చూడకూడదని, అప్పుడే ఇలాంటి వారికి బుద్ధి వస్తుందని పరశురాం పరివా హిందూ సంస్థ తరుపున ఆయన కోరారు.



# కాంగ్రెస్ కుట్రలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు

: కల్లూరి రామచంద్రారెడ్డి

**న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నామన్న బీఆర్ఎస్ నేత**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మేడిగడ్డ కుంగుబాటు వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లి రాజకీయ లబ్ధి పొందాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలకు హైకోర్టు తీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని బీఆర్ఎస్ నేత కల్లూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పును తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన ప్రకటించారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రాథమిక హక్కులను, సహజ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కడమే కాకుండా, కనీస విచారణ లేకుండా ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక చెల్లదని న్యాయస్థానం స్పష్టం చేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు అని రామచంద్రారెడ్డి అభివర్ణించారు. కాళేశ్వరం వంటి బృహత్తర ప్రాజెక్టులో వందలాది కాంపోనెంట్లలో మేడిగడ్డ ఒకటని, కేవలం రెండు పిల్లర్లు కుంగితే లక్ష కోట్లు కొట్టుకుపోయాయంటూ కాంగ్రెస్ గత రెండేళ్లుగా 'గోబెల్స్' ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించిందని మండిపడ్డారు.

# అభివృద్ధి పనులు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి : ప్రభుత్వ విప్ బీర్ల

**పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లిగుండ్ల తండాలో హెచ్ఎమ్‌డిఎ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే మర్యాల గ్రామంలో హెచ్ఎమ్‌డిఎ నిధులతో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లు మరియు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. చౌదరిపల్లి గ్రామంలో హెచ్ఎమ్‌డిఎ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకుని తండాలో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. మాచన్ పల్లి గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు. రామస్వామి తండాలో అభివృద్ధి పనులను ప్రారంభించి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోలిపేట గ్రామంలో హెచ్ఎమ్‌డిఎ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి, నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... అభివృద్ధి పనులు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందించే దిశగా కృషి జరుగుతోందన్నారు. హెచ్ఎమ్‌డిఎ నిధులతో చేపడుతున్న పనులు గ్రామాల రూపురేఖలను మార్చే విధంగా ఉంటాయని, రహదారులు, కాలువలు, తాగునీటి సదుపాయాలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అలాగే పేదల గృహ కలను నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలు లాభపడుతున్నాయని చెప్పారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు సరైన ధర లభించడంతో పాటు మధ్యవర్తుల సమస్యలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల సహకారం మరియు ఆశీర్వాదాలతో ఇంకా మరిన్ని పనులు చేపడతామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం మరియు ప్రజలు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# పుల్కుర్తి కస్తూర్బా పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, నారాయణఖేడ్ :**
నారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండల పరిధిలోని పుల్కుర్తి గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సందర్శించి, అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు మరియు అధికారులకు ఆదేశించారు. విద్యార్థినులకు అవసరమైన సదుపాయాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పుల్కుర్తి ప్రాంతంలోని బాలికల ఉన్నత విద్యను దృష్టిలో ఉంచుకుని కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల ఏర్పాటు అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. కళాశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి వెంటనే సర్వే నిర్వహించాలని సబ్ కలెక్టర్ ఉమ హారతి మరియు తహసీల్దార్‌కు ఆదేశించారు. స్థల సర్వే పూర్తయ్యిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక పంపించి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడం తమ ప్రధాన లక్ష్యమని, పాఠశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడంతో పాటు జూనియర్ కళాశాల ఏర్పాటుతో వారి భవిష్యత్తుకు మరింత అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దిగంబర్ రెడ్డి, బిరధర్ దత్తు, సిద్ధారెడ్డి, నర్సింలు సర్పంచులు, కోతుల సంగారెడ్డి, నరసింహులు తదితర స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య భద్రతపై అవగాహన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
కొత్తగూడెం ఏరియాలోని పీవీ కె నెంబర్.5 ఇంక్లైన్ మైన్‌లో సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించబడింది. 1వ షిఫ్ట్ 2వ షిఫ్ట్‌లలో హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత ఉద్యోగులకు ఎండాకాలంలో సంభవించే హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యల గురించి వివరించి, వాటి నివారణకు తగిన జాగ్రత్తలను సూచించారు. తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, సూర్యరశ్మి నుండి రక్షణ పొందడం వంటి ముఖ్యమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యంపై అవగాహన మరింత పెరిగింది. ఉద్యోగులు ఈ సూచనలను పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు. సింగరేణి సంస్థ ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత తో పాటు




మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్, వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ భూక్యా రమేష్, ఐ ఎన్ టి యు సీ పిట్ సెక్రెటరీ చిలక రాజయ్య ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గౌటే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి సాయం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గౌటే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన రాజపేట మండల కేంద్రానికి చెందిన దూస దేవేంద్ర కుటుంబానికి ఫౌండేషన్ అధినేత గౌటే లక్ష్మణ్ 50 కిలోలు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పూస రాజు, జూపల్లి రాములు, కొంక భాస్కర్, మామిడి రాజు, గౌటే ప్రశాంత్, వరిమడ్ల కనకయ్య, గౌటే అరుణ్, గౌటే కృష్ణ, గౌటే భాస్కర్ తదితరులున్నారు



# భారతినగర్ డివిజన్ లో జలమండలి ఎడి సంతోష్ పర్యటన



**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22 :**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతినగర్ డివిజన్‌లో బుధవారం నాడు జలమండలి సైబరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ పర్యటించి, డ్రైనేజీ, పైప్‌లైన్ సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

**అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సర్దుబాట్లుఫెన్సింగ్**
ఏరియాలో ప్రధాన పైప్‌లైన్‌ను స్లోప్‌లకు అనుగుణంగా మార్చాలని, అవసర చోట్ల కొత్త ప్రతిపాదనలు చేయాలని సూచించారు. బీడీఎల్ కాలనీలో పైప్‌లైన్ కొరత కారణంగా నిలిచిన మంజూరైన పనులను తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. హెచ్ఐజీ కాలనీ కనెక్షన్ల మార్పునివాసితుల కోరికపై బల్క్ కనెక్షన్‌లను వ్యక్తిగత కనెక్షన్‌లుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కాలనీల్లో డ్రైనేజీ పైప్‌లైన్‌లకు సరైన స్లోప్, అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**రామచంద్ర రెడ్డి నగర్ సమీక్ష**
రామచంద్ర రెడ్డి నగర్ కాలనీని సందర్శించి, నేషనల్ హైవే వద్ద ప్రధాన పైప్‌లైన్ పనులను పరిశీలించారు. స్లోప్‌లను సరిచేసి కాలనీ లైన్‌లను హైవే మెయిన్ హోల్స్‌కు అనుసంధానం చేయాలని సూచించారు.
జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి సింధు ఆదర్శ్ రెడ్డి
సంతోష్ జోనల్ కమిషనర్ హేమంత్‌ను కలిసి, పాత రూ.40 లక్షల నిధులను జలమండలి శాఖకు బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది, నివాసితులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి అదనపు ఎస్పీగా చైతన్య రెడ్డి బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా చైతన్య రెడ్డి, ఐపిఎస్ 22-04-2026న బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చైతన్య రెడ్డి 2022 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారి కాగా, గతంలో కామారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

# ఉగ్ర దాడిలో మరణించిన హిందువులకు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సంతాపం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో గాంధీ విగ్రహం ముందు బుధవారం సాయంత్రం బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. 22 ఏప్రిల్ 2025న భారతదేశంలోని జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లా పహల్గామ్ సమీపంలోని బైసరన్ పార్కులో, ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) తో అనుబంధంగా ఉన్న ఉగ్రవాదులు హిందూ పర్యాటకుల బృందంపై కాల్పులు జరిపగా, ఉగ్ర దాడిలో మరణించిన హిందువులను స్మరించుకుంటూ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల వెలుగులతో వారికీ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ధల్ మండల్ సంయోజక్ సట్టు రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్, బూరుగు సంతోష్ రెడ్డి, శంకర్, నరేష్, మధుసూదన్, సిద్దులు, అవినాష్, సాయిక్రిష్ణ, భగవాన్ రెడ్డి, శ్రీధర్, చింటూ, పరశురామ్, బాబు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మా కులాల జనాభా వివరాలు ఎందుకు ప్రకటించలేదు?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టులో బేస్త, గంగపుత్ర, గుండ్ల బేస్త కులాల జనాభా వివరాలు ప్రత్యేకంగా చూపలేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకటించిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టులో బేస్త, గంగపుత్ర, గుండ్ల బేస్త కులాలకు సంబంధించిన జనాభా వివరాలు స్పష్టంగా వెల్లడించబడలేదు. ఆ రిపోర్టులో మా కులాలను అగ్నికులక్షత్రియ కులంలో ఉప కులాలుగా పేర్కొన్నారు. అయితే వాస్తవానికి అగ్నికులక్షత్రియ కులం ప్రధానంగా ఆంధ్ర ప్రాంతానికి చెందినది. తెలంగాణ రాష్ట్రంలో బేస్త, గంగపుత్ర, గుండ్ల బేస్త కులాలు మాత్రమే ముఖ్యంగా ఉన్నాయి. కాబట్టి మేము అగ్నికులక్షత్రియ కులానికి ఉప కులాలము కావని స్పష్టంగా తెలుపుతున్నాము. వర్గీకరణ చేయడం వలన మా కులాలకు సంబంధించిన ఖచ్చితమైన జనాభా వివరాలు బయటకు రాకపోవడంతో మా సమాజం తీవ్ర అసంతృప్తికి గురైంది. తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా ఆరు లక్షలకు పైగా ఉన్న మా కులాల జనాభా వివరములు ప్రకటించకపోవడం బాధాకరం, మా కులాలను ప్రత్యేకంగా చూపటంలో అధికారులు చూపిన నిర్లక్ష్యాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లి జరిగిన పొరబాటును వెంటనే సరిచేసి బెస్త, గంగపుత్ర, గుండ్ల బెస్త కులాలను ప్రత్యేకంగా చూపినట్లు చూడగలరని కోరుతున్నారు.

# మల్లిఖర్జున ఖర్గే పై కేసు నమోదు చేసి పిచ్చాసుపత్రికి తరలించాలి.....

**యదాద్రి భువంగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ  మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టి జాతీయ  అధ్యక్షుడు మల్లిఖర్జున కార్గే దిష్టిబొమ్మను బుధవారం రాజపేట మండల కేంద్రంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో దహనం చేసారు. ఈ కార్యక్రమంలో యదాద్రి భువంగిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ....  ప్రపంచంలోనే అన్ని దేశాలు కీర్తించే భరతదేశ ప్రధానమంత్రి మోడీ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్లికార్జున కార్గే కి మతిభ్రమించిందని వెంటనే అతని పై కేసు నమోదు చేసి పిచ్చాసుపత్రికి తరలించాలని గతంలో కూడా స్వయం ప్రతిపత్తి గల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు గుర్తు చేశారు. ఖర్గే ను పార్టీ నుండి బహిష్కరించాలని లేని పక్షాన భరతజాతి కాంగ్రెస్ పార్టీని క్షమించదన్నారు. ఈ కార్యక్రమంలో కాసోజు సంపత్, దాచేపల్లి శ్రీనివాస్, కుమ్మరి లక్ష్మణ్, మండల జనరల్ సెక్రటరీ మెండు భగవాన్ రెడ్డి, అంకతి భాస్కర్, బూర్గు శేఖర్ రెడ్డి, సాధనబోయిన శెంకర్, చిగుల్లా బీరయ్య, బిర్రు సురేష్, ఎక్కలదేవి శ్రీహరి, మెడబోయిన శివరాములు, కాకల్లా నవీన్, సంగెమ్ వేణు, మెండు మనికంఠ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ లో ఆర్టీసీ కార్మికుల సమ్మెబాట

**బుధవారం బస్సులు బంద్ - ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు**

**ఆర్టీసీ డిపోలో ఎక్కడికి అక్కడే నిలిచిపోయిన బస్సులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, నారాయణ ఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గం అన్ని మండలాలకు ప్రధానంగా సంగారెడ్డి, జోగిపేట్ హైదరాబాద్ రూట్ వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వంతో నిన్న(మంగళవారం) జరిగిన చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచే బస్సులను నిలిపివేశారు కార్మికులు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాల్సిందే అంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె సైరన్ మోగించింది. దీంతో బస్సులన్నీ డిపోలకే పరిమితం అయ్యాయి. సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ పట్టణ కేంద్రంలో ఆర్టీసీ డిపోలో బస్సులను పూర్తిగా నిలిపివేశారు. కార్మికులు సమస్యలను ముగించి డిపోలో తెల్లవారుజామునుండే బంద్ పాటించారు. ముందస్తు చర్యగా పోలీసులు డిపోలో మోహరించారు. ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో ప్రజలు నారాయణఖేడ్ బస్టాండ్ లో ఉదయం నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కాగా, ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన 32 హామీలను నెరవేర్చాలని ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని పెద్దతండా, పల్లె పహాడ్, మాదాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ధాన్యం తేమ శాతం, తూకం విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి నమిల కేదారి 50 కిలోల బియ్యం అందజేత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట గ్రామంలో ఇటివల మరణించిన దుస దేవంద్ర కుటుంబానికి స్వాతీ చికెన్ సెంటర్, ఉపసర్పంచ్ నమిల కేదారీ, నరేష్ బుధవారం 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో  మిత్రులు డాక్టర్ చింతల రవి, కొంక భాస్కర్, పిసికే గణేష్, పిండికూర మహేష్, చింటూ, భాను, సాయి,  గొల్లేన ప్రశాంత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## ఏనే ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్
# పాఠశాలలకు దీటుగా గ్రాడ్యుయేషన్ డే

**హైదరాబాద్ పల్స్ న్యూస్,ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల పరిధిలోని మారుమూల ప్రాంతం ఎనెగూడ గ్రామంలో గల ఏనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. సాధారణంగా ఖరీదైన కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలను, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం అత్యంత ఘనంగా నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించిందని అధిదులు ముగ్దులైన్నారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకకు మండల విద్యాధికారి (ఎం ఈ ఓ) చెరుకుపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉతీర్ణులైన విద్యార్థులందరికీ వారి చేతుల మీదుగా మెడల్స్, రిజల్ట్స్ షీట్లను అందజేశారు. విద్యార్థులందరూ కాన్వొకేషన్ డ్రెస్సులు ధరించి, పట్టాలు అందుకుంటున్న దృశ్యం చూపరులను ముగ్ధులను చేసింది. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి వాతావరణం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

**రాష్ట్రానికే ఆదర్శం**

ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఇటువంటి వినూత్న కార్యక్రమం నిర్వహించడం రాష్ట్రంలోనే ఇదే మొదటిసారి కావచ్చు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతాయి" అని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.



**ఉపాధ్యాయులకు అభినందనలు**

పాఠశాలను ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రధాన ఉపాధ్యాయురాలు అంకం కళ్యాణి ని, ఉపాధ్యాయులు కుందేటి కృష్ణమూర్తి ని ఎంఈఓ ప్రత్యేకంగా అభినందించారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని రీతిలో ఈ ఉత్సవాన్ని నిర్వహించినందుకు వారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ మానేపల్లి పెంటయ్య, ఉప సర్పంచ్ అనాల స్వరూప రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. తమ గ్రామ పాఠశాలలో అద్భుతమైన వేడుకల పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు.

# నీట్ పరీక్ష పకడ్బందీ నిర్వహణకు అధికారులకు ఆదేశాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నీట్ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవనంలో ఆసిఫాబాద్ ఆర్‌డీఓ లోకేశ్వర్‌రావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 336 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారు. పరీక్షా పేపర్లను పటిష్ట భద్రత మధ్య తరలించాలని, కేంద్రంలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.



# రాజపేట అంగన్వాడీ కేంద్రం - 2లో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం - 2 లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పార్వతి ముందుగా తల్లుల సమావేశం ఏర్పాటు చేసి అంగన్వాడి కేంద్రం లో ప్లే స్కూల్ ద్వారా పిల్లలకు ఏ విధంగా ఆటపాటల ద్వారా విద్యను అందించటం, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మంచి పౌష్టికాహారాన్ని అందజేయడం, ప్రతి నెల బరువు ఎత్తును సరి చూసుకుంటూ బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని ఇస్తూ తల్లులకు తగిన సలహాలు సూచనలు అందజేస్తూ, గర్భిణీ బాలింతలకు తగిన పౌష్టికాహారాన్ని ఇస్తూ ప్రతి నెల అంగన్వాడీ కేంద్రంలో రెండో శనివారం రోజున ఆరోగ్య సిబ్బందిచే ఆరోగ్య తనిఖీలు చేయిస్తూ సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ఐదు సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలు ప్లే స్కూల్ విద్యను పూర్తి చేసుకుని వచ్చే సంవత్సరానికి ఒకటో తరగతికి వెళ్తున్న పిల్లలు ప్రోగ్రెస్ కార్డును తల్లిదండ్రులకు వివరిస్తూ అందజేశారు ఈ సేవలన్నీ ఆన్లైన్ లో ఏవిధంగా పొందుపరుస్తున్న విషయాలను తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లులు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి పంపించిన తర్వాత తమ పిల్లలు అన్ని ఆటలలో పాటల్లో చురుగ్గా ఉంటున్నారని అంగన్వాడీ కేంద్రానికి పంపించడం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తల్లులు ఎర్రగోకుల సంతోష, దుబ్బాసి వెన్నెల, పొలిమేర ప్రభావతి, కొత్త భానుప్రియ, పెద్దోళ్ల సరిత, మేకల పవిత్ర, మామిడి మల్లీశ్వరి ఆయమ్మ కోయ విజయ చిన్నారులు పాల్గొన్నారు.


# దుస దేవేంద్ర కుటుంబనికి జైశ్రీరామ్ ఫౌండేషన్ సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన దుస దేవేంద్ర కుటుంబనికి బుధవారం జైశ్రీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో (180వ ) 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేసారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి శ్రీనివాస్, చెలమనపల్లి లక్ష్మన్, సర్పంచ్ కోయ మధు, చిగుళ్ల బిరయ్య, బిర్రు సురేష్, అంకతి భాస్కర్, సంగం వేణు, సఖినాల చిరంజీవి, సాయి, నవీన్, ముని, కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

# భద్రాద్రి కొత్తగూడెం టీజీజీడీఏ ఎన్నికలు ఏకగ్రీవం

**అధ్యక్షుడిగా డా. దుబ్బాసి ప్రవీణ్ కుమార్ ఎన్నిక**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (మోడ్రన్ మెడిసిన్) యూనిట్‌కు 2026--2028 కాలానికి నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా పూర్తయ్యాయి.ఈ ఎన్నికలలో మొత్తం 6 నామినేషన్లు దాఖలవగా, అవన్నీ చెల్లుబాటు కావడంతో అన్ని పదవులకు పోటీ లేకుండానే అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అధ్యక్షుడిగా డా. దుబ్బాసి ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డా. బి. సైదులు, కోశాధికారిగా డా. భూక్య వీరబాబు ఎన్నికయ్యారు.జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డా. రామవత్ బలోజి, డా. ఆర్. కరుణాకర్, డా. అజహర్ బాబా షేక్ ఎంపికయ్యారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి తిరస్కరణలు లేదా ఉపసంహరణలు నమోదు కాకుండా, మొత్తం 6 నామినేషన్లు చెల్లుబాటు కావడం విశేషం.కొత్తగా ఎన్నికైన కమిటీకి వైద్యుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తమ పదవీకాలంలో వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆకాంక్ష వ్యక్తమవుతోంది.

# కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవం

**గాదే నర్సిరెడ్డి వరిపొలంను పరిశీలించిన శాస్త్రవేత్తలు**
**రాంగోపాల్ వర్మ అదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం**
**భరత్ కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం**
**వ్యవసాయ శాఖ అధికారి ఏడీఏ తాతారావు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సోంపల్లి పంచాయతీ పరిధిలో గల కిన్నెరసాని పరివాహక ప్రాంతం ఆదర్శ రైతు గాదేనర్సిరెడ్డి పొలంలో పాత పద్ధతులను వీడి నూతన పద్ధతులను అవలంబిస్తూ డ్రోన్ ద్వారా కూడా వ్యవసాయం సాగు చేయవచ్చు అని నిరూపించారు కృషి విజ్ఞాన కేంద్రం కొత్తగూడెం. ఈ సందర్భంగా ఆ యూనిట్ హెడ్ టి.భరత్ మాట్లాడుతూ డ్రోన్ ప్రయోగానికి ఒక ఎకరం సాగు భూమి ఇచ్చి సహకరించిన ఆదర్శరైతు గాదె నర్సిరెడ్డిని అభినందించారు. డ్రోన్ వినియోగం ద్వారా అధిక ఖర్చులను నిర్మూలించవచ్చని డ్రోన్ వినియోగంతో పంట సంరక్షణకు కావాల్సిన ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ పిచ్చుకారి సులభతరంతో పాటు కూలీల బెడధ నుంచి విముక్తి పొందవచ్చని అన్నారు. డ్రోన్ వ్యవసాయ పద్ధతులను పరిశీలించడానికి అదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం నుంచి విచ్చేసిన రామ్ గోపాల్ వర్మకు స్వాగతం పలికారు. పంటలను పరిశీలించిన రాంగోపాల్ వర్మ డ్రోన్ పనితీరు పై ఆదర్శ రైతు గాదే నర్సిరెడ్డి అభిప్రాయాన్ని తీసుకొని పంట నాణ్యతను పరిశీలించారు. పంట దిగుబడి అంచనా 40 కింటాలు వస్తుందని ఆదర్శ రైతు ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇంతటి ప్రోత్సాహాన్ని కల్పించిన కెవికె కృషి విజ్ఞాన కేంద్రానికి మరియు గత కలెక్టర్ జితేష్ వి పాటిల్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డ్రోన్ వినియోగ పద్ధతి ద్వారా 10 వేల రూపాయల ఖర్చు ఆదావుతుందని ఆనందం వ్యక్తం చేశారు. రైతులు పాత పద్ధతులను వేడి నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీం, అదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారి ఏడిఏ తాతారావు మణుగూరు సోంపల్లి గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాముడిని, రామాయణాన్ని కించపరిస్తే హిందువులు సహించరు

**శ్రీరాముని గురించి ప్రకాష్‌రాజ్ విషపు మాటలపై భద్రాద్రి హిందూ ఐక్యవేదిక హెచ్చరిక**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో హిందూ ఐక్యవేదిక, విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత్ విభాగం, బిజెపి నాయకులతో పాటు ఇతర హిందూ సంఘాలు సినీనటుడు ప్రకాష్‌రాజ్ చేసిన హిందూ ధర్మం, రామాయణం విషయాలపై వివాదాస్పద వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాయి. ఇటీవల కేరళలో జరిగిన సాహిత్యోత్సవంలో ప్రకాష్‌రాజ్ రాముడిని ఉత్తర భారతీయుడు, రావణుడిని దక్షిణాది గిరిజనుడు అని, రాముడు పండ్లు దొంగిలించాడని చెప్పడం ద్వారా హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారని నాయకులు ఆరోపించారు . ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన సమావేశంలో నాయకులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత్ తెలంగాణా రాష్ట్ర సహ ప్రముఖ ఓరుగంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కోపం ఉంటే అతనిపై చూపించాలి కానీ, ఆ ముసుగులో హిందూ సంఘాలు, ధర్మాన్ని జోలికి వస్తే హిందువులు ఎవరూ ఊరుకోరని స్పష్టం చేశారు. ప్రకాష్‌రాజ్ నాస్తికవాద ముసుగులో హిందూ ధర్మాన్ని కించపరుస్తున్నారని, తన తల్లి మరణానంతరం ఆమె ఇష్టానుసారం క్రైస్తవ మార్గంలో అంత్యక్రియలు చేసి తల్లి ఆత్మను తృప్తి పరిచిన వాడు హిందువుల మనస్సును గుర్తించి మాట్లాడాలని సూచించారు. ఇటువంటి వ్యాఖ్యలు సహించలేమని, హిందూ ఐక్యతను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. బిజెపి నాయకుడు, బిఎంఎస్ బిజ్జం అశోక్ రెడ్డి తన ప్రసంగంలో ప్రకాష్‌రాజ్ అనుచిత వాక్యాలను ఖండిస్తూ, హిందూ ధర్మంపై బురద, విషం చల్లుతున్నారని, భారతదేశం అంతా ఇది చూస్తోందని అన్నారు. ప్రకాష్‌రాజ్ సినిమాలు అన్నీ హిందూ సంప్రదాయాలు, దేవాలయాలపై ఆధారపడి నటించి లాభాలు పొందాడని, ఇప్పుడు బొట్లు పెట్టుకుని దేవాలయాలకు వెళ్లి అవమానిస్తున్నాడని ఆరోపించారు. అతను క్షమాపణ చెప్పకపోతే అతని సినిమాలన్నీ బ్యాన్ చేస్తామని, నిర్మాతలు వేషాలు ఇస్తే వారిని కూడా శిక్షిస్తామని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక జారీ చేశారు. హిందువులు ఐక్యంగా ఉండకపోతే ధర్మంపై దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు.హిందూ ఐక్యవేదిక సభ్యులు భాస్కర్, కామేశ్వరరావుతో పాటు ఇతర నాయకులు మాట్లాడుతూ, ప్రకాష్‌రాజ్ వంటి వారు సెలబ్రిటీల స్థాయిలో మత విభేదాలు కలిగించే మాటలు చెప్పడం సమాజానికి హాని కలిగిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి సహా పలువురు రూ.100 కోట్ల పరువు నష్టం దావాలు వేశారని, 295ఏ సెక్షన్ కింద కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు . జిల్లాలో ఇలాంటి వ్యాఖ్యలు సహించకుండా ఉద్యమం చేపడతామని, హిందూ సంప్రదాయాలను రక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# పోచమ్మ గుడిలో దొంగతనం చేసిన దొంగ అరెస్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి,**
సోమవారం అర్ధరాత్రి పోచమ్మ గుడి లో దొంగతనం కేసులో దొంగను అరెస్టు చేసి ప్రెస్ మీట్ నిర్వహించిన కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ టూ టౌన్ సిఐ ప్రతాప్. సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్బాద్ పోచమ్మ గుడిలో హుండీనీ పగలగొట్టి అందులోనే 300 రూపాయలు అమ్మవారి త్రిశూలం దొంగలించుకొని వెళ్లగా అట్టి విషయంలో కొత్తగూడెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయబడినది అదే రోజు అర్ధరాత్రి రామవరం పునందాసు గడ్డలో భూక్య లావణ్య కిరాణా షాపు నందు దొంగతనం జరిగి కొన్ని మద్యం బాటిళు ,, 4000 రూపాయలు నగదు దొంగిలించి పడగా అట్టి విషయమై కేసు నమోదు చేయబడినది. అట్టి విషయమై కొత్తగూడెం టు టౌన్ సిఐ ప్రతాప్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేయుచుండగా పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో గతంలో పలు నేరాలకు పాల్పడిన మర్రిగూడెం గ్రామానికి చెందిన మడివి భద్రయ్య తండ్రి సింగయ్య అను వ్యక్తి అనుమానంతో ఒక సంచితో తిరుగుతుండగా అట్టి వ్యక్తిని పట్టుకొని విచారించగా అతను పోచమ్మ గుడిలో జరిగిన దొంగతనం నేనే చేశానని అందులోని హుండీని పగలగొట్టి అందులో వున్న 300 రూపాయలు దొంగిలించినానని, ఇంకా ఏమైనా దొరుకుతాయని వెతుకుతుండగా అమ్మవారి చేతిలో ఉన్న త్రిశూలం కనపడగా త్రిశూలం గట్టిగా లాగగా అమ్మవారి చేయి విరిగినది త్రిశూలం దొంగిలించినానని అంతకుముందు రామవరం లోనీ వనందాసు గడ్డలో చిట్టి రామవరం వెళ్లే దారిలో ఉన్న కిరాణం షాపులో దొంగతనం చేసి మద్యం బాటిల్లు, 4000 రూపాయలు నగదును దొంగతనం చేశానని నేరం ఒప్పుకున్నాడు. అట్టి వ్యక్తి మద్యం బాటిలను కొన్ని అమ్ముకోగా, అతని వద్ద 13 కోటర్ బాటిల్స్, 300 రూపాయల నగదు దొరకదా పంచుల సమక్షంలో కొత్తగూడెం టూ టౌన్ సిఐ పంచనామ ద్వారా స్వాధీన పరుచుకొని సదరు ముద్దాయి మడివి భద్రయ్యను అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం పంపించడం జరుగుతుందని కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ తెలియజేశారు.




# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కరపత్రాల ఆవిష్కరణ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, సిద్దిపేట జిల్లా:**
వర్గల్ మండలంలోని అంబర్పేట గ్రామంలో ఈనెల 26 ఆదివారం నాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహావిష్కరణ సందర్భంగా, ఆవిష్కరణ మహోత్సవ కర పత్రమును వర్గల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్లో ఎంఈఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి డ్యాగ నవీన్ కుమార్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు ధర్మని లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ వర్గల్ మండల అధ్యక్షులు హౌసులపల్లి నవీన్ కుమార్, మాజీ జెడ్పిటిసి పోచయ్య, ఉపాధ్యక్షులు అంకని పోచయ్య, కర్రే వెంకటేష్, అంబేద్కర్ సంఘం మండల నాయకులు మాసన్ పల్లి అశోక్, దుడ్డ స్వామి, బాగనోళ్ల స్వామి మరియు అంబర్పేట్ గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అల్లాపురం స్వామి, ఉపాధ్యక్షులు అల్లపురం రాజు, ప్రధాన కార్యదర్శి ధర్మని ప్రవీణ్, గంగేల సందీప్ సమక్షంలో విడుదల చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ, ఉద్యమకారులు, తెలంగాణ భాషా సంస్కృతి మరియు టూరిజం శాఖ సలహాదారులు డాక్టర్ దరువు ఎల్లన్న మరియు ప్రధాన వక్తగా వేల్పుల ఐలయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముస్తాబాద్, తదితరులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. కావున ఈనెల 26న ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బడుగు బలహీన వర్గాల ముద్దుబిడ్డ, పేదల పెన్నిధి, భారతదేశ న్యాయ నిపుణులు, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహావిష్కరణ కార్యక్రమమునకు వర్గల్ మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి అభిమానులు, అంబేద్కర్ గారి అభ్యుదయవాదులు, ఆయన ఆశయ సాధకులు, పెద్దలు యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ అంబేద్కర్ గారి ఆశా సాధనలో బాగస్వాములు కావాలని కోరుతున్నాము.



# విద్యానగర్ లో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు

**గిరిజన చట్టాలను లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు**
**ఆక్రమ నిర్మాణాలకు పార్కింగ్ ప్లేసులు ఉండక రోడ్లమీదనే వాహనాలు**
**ఇవేవి మాకు పట్టనట్లు చోద్యం చూస్తున్న అధికారులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచయతీ పరిధిలో అనేక బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. గతంలో అనేక అక్రమ నిర్మాణాలపై వార్త తరంగాలు దినపత్రిక లో ఎన్నో కథనాలు ప్రచురించాయి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారికి అండగా నిలిచిన అధికారులపై చర్యలు తీసుకుంటామని గత కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు చెబుతన్న ఇవేమీ మాకు పట్టవు అన్నట్లుగా పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది అనేక అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారు కళ్ళ ఎదుట అక్రమ నిర్మాణాలు కడుతున్నప్పటికీ ఇవేవీ కనిపించలేవు కనిపించట్లేదు అన్నట్టుగా పంచాయతీ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి 1/70 యాక్టుల్లో నిర్మాణాలు చేపట్టవచ్చా చేపడితే గిరిజన చట్టాలు వారికి వర్తిస్తాయా లేక పంచాయతీ అధికారులు సిబ్బంది గిరిజన చట్టాలను తుంగలో తొక్కుత్నరీ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారా? ఇవన్నీ తెలిసిన అధికారులు మౌనంగా ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటా అని బహిరంగానే చర్చించుకుంటున్న ప్రజలు . గతంలో ప్రజాప్రతినిధులు లేకుండా ఉండేది మరి ఇప్పుడు ప్రజాప్రతినిధులు ఉన్నారు మరి వారైనా ఇటువంటి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేస్తారా లేదా అన్నది చూడాల్సిందే ఏది ఏమైనా విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు సైతం నిర్మిస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహమే లేదు.. ఇలా అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా లేకుండా నిర్మాణాలు చేస్తుండడం నిర్మాణాలు పూర్తయిన తర్వాత పార్కింగ్ ప్లేస్ ఉండక రోడ్లు మీదనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది దీనితో అనేక ఆక్సిడెంట్లు జరుగుతున్నాయి ఎన్ని రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు చేసినప్పటికీ అనుమతులు లేని వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ ప్లేస్ లేక రోడ్లమీదనే వాహనాలు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఎటువంటి అనార్థాలు జరగకుండా ఉండాలంటే ముందుగానే ఇటువంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఆకులు కాలాక చేతులు పట్టుకుంటే ఏం లాభం అన్నట్టుగా పార్కింగ్ స్థలాలు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులు నిర్మించకుండా ముందస్తుగానే కఠిన చర్యలు అధికారులు తీసుకుంటే ఈటువంటి ప్రమాదాలను నివారించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కావున అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను జి ప్లస్ త్రీ నిర్మాణాలను సైతం నిలుపుదల చేసి వారికి అండగా నిలిచిన పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.





# గుండంరాజుపల్లి ఘనత - పోరాట వీరుల విగ్రహాలతో గ్రామం గర్వించేసింది



**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 22, మహబూబాబాద్ ప్రతినిధి :**
సామాజిక చైతన్యం, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన గుండం రాజుపల్లి గ్రామం మరోసారి ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. గ్రామంలో డా. బీఆర్ అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపన్న, ఏకలవ్య, గునిగంటి బుచ్చయ్యల విగ్రహాలను అట్టహాసంగా ఆవిష్కరించడం ద్వారా ప్రజల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం పాల్గొని సభకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు.

**కమలాకర్ సేవలపై ఎమ్మెల్యే ప్రశంసలు**
సభలో మాట్లాడుతూ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ కమలాకర్ నాయకత్వాన్ని కొనియాడారు. జెడ్పిటిసి పదవికి అవకాశంలేకపోయినా, సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేయాలని తనే సూచించానని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో కమలాకర్ చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

**జన సందోహంతో కిక్కిరిసిన సభ**
ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. సభ ప్రాంగణం జనంతో నిండిపోవడంతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నాయకుల ప్రసంగాలకు ప్రజలు చప్పట్లతో స్పందిస్తూ కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేశారు.

**సాంస్కృతిక కార్యక్రమాల సందడి**
జబర్దస్త్ టీమ్ సభ్యులు తమ వినోదాత్మక ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మానుకోట ప్రసాద్ పాటలతో ప్రారంభమైన కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది.

**వేలమందికి అన్నదానం**
కార్యక్రమానికి హాజరైన ప్రజలందరికీ భోజన సదుపాయం కల్పించడం విశేషంగా నిలిచింది. గ్రామస్తులు, నిర్వాహకులు కలిసి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ప్రశంసల వెల్లువ**
ఇంత పెద్ద స్థాయిలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు కమలాకర్‌పై నాయకులు, గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపించారు. గుండం రాజుపల్లి గ్రామం పోరాట స్ఫూర్తి మాత్రమే కాదు, సామాజిక ఐక్యతకు కూడా మార్గదర్శకంగా నిలుస్తోందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కవులు, వక్తలు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారత్ కు ఇరాన్ బిగ్ షాక్..! నౌకపై దాడి, స్వాధీనం..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22 :**
అమెరికా-ఇజ్రాయెల్ తమపై యుద్ధం మొదలుపెట్టాక భారత్ విషయంలో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఇరాన్ ఇవాళ మరో షాకిచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు వారాల కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగించిన గంటల వ్యవధిలోనే హార్ముజ్ జలసంధి మీదుగా గుజరాత్‌కు వెళ్తున్న ఒక సరుకు రవాణా నౌక తో సహా రెండు నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దాడి చేసింది. అలాగే నౌకల్ని స్వాధీనం కూడా చేసుకుంది. గత వారం కీలకమైన హార్ముజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన భారత జెండా కలిగిన రెండు నౌకలపై దాడి జరిగిన తర్వాత.. ఇవాళ చోటు చేసుకున్న ఈ సంఘటన ఇరాన్, భారత్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇవాళ పనామా జెండా కలిగిన మీజ ఫ్రాన్సెస్కా, లైబీరియా జెండా కలిగిన ఎపామినోడెస్ అనే ఆ రెండు నౌకలపై ఇరాన్ దాడి చేసి స్వాధీనం చేసుకుంది. గ్రీకు యాజమాన్యంలోని యూఫోరియా అనే మూడవ నౌకను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. అది ఇరాన్ తీరంలో చిక్కుకుపోయింది. సముద్ర ట్రాఫిక్ డేటా ప్రకారం ఎపామినోడెస్ దుబాయ్ నుంచి గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు వెళ్తోంది. ఈ నౌకలకు తగిన అనుమతి లేదని, అవి "నావిగేషన్ వ్యవస్థలను తారుమారు చేశాయని", తద్వారా సముద్ర భద్రతకు ప్రమాదం కలిగించాయని ఇరాన్ నౌకాదళం పేర్కొంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి వాస్తవంగా ఇరాన్ నియంత్రణలో ఉన్న హార్ముజ్‌లో మూడు వాణిజ్య నౌకలపై కాల్పులు జరిగాయని అంతకుముందు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ తెలిపింది. ఈ జలమార్గంపై ఇరాన్ పట్టు సాధించడం వల్ల చమురు సరఫరా స్తంభించిపోయి, ముడి చమురు ధరలు ఆకాశాన్నంటాయి. ఇటీవల అమెరికా మెరైన్లు తమ నావికా దిగ్బంధంలో భాగంగా ఒమన్ గల్ఫ్ సమీపంలో ఇరాన్ జెండా ఉన్న రెండు సరుకు రవాణా నౌకలను స్వాధీనం చేసుకున్నందుకు, ఇది ప్రతీకార చర్యగా జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.






# కిష్టారెడ్డి పేట వద్ద నెంబర్ ప్లేటు లేని ఆటోతో పట్టుకున్న పోలీసులు

**అమీన్పూర్‌లో బజాజ్ సిఎన్‌జీ ఆటో దొంగతనానికి స్వయంగా ఒప్పుకున్న యువకుడు రిమాండ్‌కు**




**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22 :**
సంగారెడ్డి జిల్లా, అమీన్పూర్ కిష్టారెడ్డిపేట చౌరాస్తా వద్ద వాహన తనిఖీలో నెంబర్ ప్లేటు లేని అనుమానాస్పద ఆటోను ఆపిన పోలీసులు, అందులో ఉన్న వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడి పట్టుకుని విచారించారు. తన పేరు హిమాన్షు యాదవ్ (22), తండ్రి మోహన్ యాదవ్. యాదవ్ కులం, డ్రైవర్, ఇస్నాపూర్ మున్సిపాలిటీ, పాటాన్‌చెరు మండలం, అంబేద్కర్ గ్రాంధి వద్ద సద్నే మార్కెట్ రోడ్‌లో నివాసం. బీహార్ రాష్ట్రం, బాక్సర్ జిల్లా, కులహనా మండలం, పరసియా గ్రామం, వార్డు నెం.6 నేటివ్ అని తెలిపాడు.
తేదీ 21.03.2026న అమీన్పూర్‌లో ఒక ఇంటి వద్ద బజాజ్ సిఎన్‌జీ (ఎకో గ్రీన్ కలర్) ఆటో దొంగతనం చేసి, తన ఇంటి వద్ద రహస్యంగా దాచి, నెంబర్ ప్లేటు తీసేసి అమ్మడానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అమీన్పూర్ పోలీసుల వాహన తనిఖీలో పడ్డాడని నిందితుడు ఒప్పుకున్నాడు. ఆటో నెంబర్: టి.జి 34 టి 4937. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఈ యువకుడిపై 5 దొంగతన కేసులు ఉన్నాయని అమీన్పూర్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# ఇకనైనా నిరాధార ఆరోపణలు మానుకోవాలి : కాంగ్రెస్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** చల్లూరు మైనింగ్, క్రషర్ విషయం లో నిరాధార ఆరోపణలు ఇప్పటికైనా మానుకోవాలని రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హితవు పలికారు. మైనింగ్, క్రషర్ కు సంబంధించిన యాజమాన్యం వారు మీడియాకు పూర్తి ఆధారాలతో కూడిన వివరాలు తెలుపుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడం బిఆర్ఎస్ పార్టీ వారు గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రజల మనిషిగా, సేవకుడిగా,అభివృద్ధి ప్రదాతగా ప్రజలందరి మన్ననలు పొందుతున్న బీర్ల ఐలయ్యను అనవసరంగా విమర్శించడం తప్పుడు ప్రచారాలతో రాజకీయాలబ్ది పొందాలనుకోవడం బిఆర్ఎస్ పార్టీ నాయకులకు క్రషర్ మైనింగ్ యజమానుల ప్రెస్ మీట్ చెంపపెట్టులా అయిందన్నారు . రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు సీనియర్లు కార్యకర్తలు బీర్ల అభిమానులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరామర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22 :**
అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసున్నారు. భగవంతుని కృపతో త్వరగా కోలుకొని ప్రజాసేవలోకి రావాలని ఆయన అభిలాషించారు.

# భారత్ ను భయపెట్టేందుకు పాకిస్థాన్ యుద్ధ సన్నాహాలు..! ఏకంగా ఆ మిసైల్ తో..?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22 :**
భారత్ సరిహద్దు దేశమైన పాకిస్థాన్ కు భారత్ పై ఎప్పుడూ దాడులు చేయాలని ఉంటుంది. ఇప్పటికే భారత్ పై పాకిస్థాన్ ఉగ్రమూకలు అనేక సార్లు దాడులు చేశాయి. దాడులు జరిగిన ప్రతి సారీ భారత్.. ఆ దేశానికి గట్టిగా బుద్ధి చెబుతూ వస్తోంది. అయినా కూడా ఎంత కొట్టినా చావని పాములా పాకిస్థాన్ వ్యవహరిస్తోంది. గతేడాది ఇదే రోజున ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ లో పాకిస్థాన్ ఉగ్రదాడి చేపట్టింది. 26 మంది అమాయక టూరిస్టులను పొట్టనపెట్టుకుంది. అందుకు ప్రతీకారంగా మే 7-10 వరకు భారత్ ఆ దేశంపై ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. అలాగే వందలాదిమంది ఉగ్రమూకలను ఏరిపారేసింది. అలా పాకిస్థాన్ కు భారీ నష్టం కలిగించింది. అయితే పహల్గామ్ ఘటన జరిగి నేటికి ఏడాది పూర్తి కానున్న నేపథ్యంలో పాకిస్థాన్ కావాలనే భారత్ ను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోంది. తాజాగా అరేబియా సముద్రంలో పాకిస్థాన్ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన తైమూర్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణిని పాకిస్థాన్.. అరేబియా సముద్రంలో విజయవంతంగా పరీక్షించింది. 600 కిలోమీటర్ల దూరం నుండి శత్రు దేశాల నౌకలను అటాక్ చేయగల సామర్థ్యం ఉంది. ముఖ్యంగా భారత్ లోని ఐఎన్ఎస్ విక్రాంత్ లను లక్ష్యంగా చేసుకునేలా ఈ క్షిపణిని రూపొందించారు. పాకిస్థాన్ స్వదేశీ టెక్నాలజీ 'తైమూర్' క్రూయిజ్ మిసైల్ ను రూపొందించింది. ఈ క్షిపణి అరేబియా సముద్రంలో భారత్ కు సవాల్ గా మారనుంది. ఈ క్షిపణి రాడార్లకు చిక్కకుండా తక్కువ ఎత్తులో ప్రయాణించే సాంకేతికతను 400 నుండి 450 కిలోల బరువున్న శక్తివంతమైన పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇది విధ్వంసక నౌకలను, ఫ్రిగేట్ లను ముంచేందుకు ఉపయోగపడుతుంది. అలాగే ఈ క్షిపణి తక్కువ శబ్దం కంటే ప్రయాణించినప్పటికీ, సముద్ర మట్టానికి కేవలం 152 మీటర్ల ఎత్తులో ప్రయాణించడం వల్ల దీనిని గుర్తించడం కష్టంగా ఉంది. ప్రస్తుతం భారత్ వద్ద ఇతర విమాన వాహక నౌకలు, బరాక్ 8 వంటి అధునాతన రక్షణ వ్యవస్థలతో బలంగా ఉన్నప్పటికీ, తైమూర్ క్షిపణి.. భారత్ కు సవాల్ గా మారిందని చెప్పొచ్చు. ఇక పహల్గామ్ ఉగ్రదాడి జరిగి నేటికి సరిగ్గా ఏడాది కావొస్తుంది. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మందిని కాల్చి చంపారు టెర్రరిస్టులు. అందుకు ప్రతీకారంగా భారత్.. ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే.



# కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత

**హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కు చెంపపెట్టు..**
**రేవంత్ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు..**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కాళేశ్వరం ముమ్మాటికి తెలంగాణాకు ప్రాణేశ్వరమని బీఆర్ఎస్ పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబందించి రాష్ట్ర హై కోర్టు ఇచ్చిన తీర్పు పై బుధవారం ఆమె స్పందించారు. మేడిగడ్డ కుంగుబాటు వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లి రాజకీయ లబ్ధి పొందాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలకు హైకోర్టు తీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన కుట్రలను హైకోర్టు వెలువర్చిన తీర్పుతో ధర్మం గెలిచిందన్నారు. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్ పై బురద జల్లే ప్రయత్నం చేశారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేశారని, రేవంత్ రెడ్డి డ్రామాలు వెలుగులోకి వచ్చాయన్నారు. హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అయిందని రేవంత్ రెడ్డి మాట్లాడారని, అది కూళేశ్వరం కాదు.. తెలంగాణ ప్రజలకు ప్రాణేశ్వరమని వెల్లడించారు. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టిందని తెలిపారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయన్నారు. ప్రజా సమస్యలు పక్కన పెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజ స్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం



అయ్యిందని గొంగిడి సునిత పేర్కొన్నారు.

# రాజపేటలో పండుగ వాతావరణంలో హిందూ సమ్మేళన ఉత్సవం

**పిల్లలకు దేశ, దైవ భక్తి వివరించాలి : విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ**







**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హిందుత్వం పై దాడి సమిష్టిగా ఎదుర్కోవాలని, పిల్లల్లో దేశ దైవభక్తిల గూర్చి తెలపాలని విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ అన్నారు. రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం వద్ద మంగళవారం రాత్రి రాజపేట ఉప మండల స్థాయి హిందూ సమ్మేళన కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవంలో భాగంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు, ముందుగా పట్టణ కేంద్రంలో పుర విధులలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజపేట మండల కేంద్రానికి చెందిన సామల రేణుశ్రీ పేరణి నృత్యం, పట్టణ కేంద్రానికి చెందిన గాయని పబ్బోజు శోభారాణి ద్వారా భక్తి పాటలు, హనుమాన్ భక్తులతో హనుమాన్ చాలీసా పరాయణం, జై శ్రీమన్నారాయణ భక్త బృందంచే సామూహిక గోవింద నామాలు సహస్రనామార్చనలు, పాముకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా పులిగిల్ల నరసింహులు, ముఖ్య అతిథి గా శ్రీ శాంభవి పీఠాధిపతి, జ్యోతిష్య శిరోమణి శ్రీనివాస శర్మ ముఖ్యవక్త నల్లగొండ విభాగ ప్రచారకులు కాసం సత్యనారాయణ, మహిళా వక్త సేవిక సమితి భాగ్యనగర విభాగ అడ్వకేట్ కాసుల మానస, ఉపాధ్యక్షులు డాక్టర్ భోగా జ్ఞానేందర్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు శ్రీనివాసులు, కోశాధికారి బూరుగు సంతోష్ రెడ్డి, గౌరవ సలహాదారులు సోమసాని రాజమల్లయ్య, బల్ల దామోదర్, కోయ మధు, మార్త జగదీశ్వర్ ఉప్పల రమేష్, 9 గ్రామాలైన బేగంపేట, రేణికుంట, రాజపేట, నర్సాపురం, పుట్టగూడెం, కొండ్రెడ్డి చెరువు, మల్లగూడెం, పాముకుంట, సింగారం, గ్రామాలకు చెందిన సర్పంచులు కార్యవర్గ సభ్యులు, అన్ని గ్రామాల ప్రజలు, సీనియర్ సిటిజన్స్ అన్ని పార్టీల నాయకులు హిందూ బంధువులు అందరూ పాల్గొన్నారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ దేశంలో హిందూ సమాజంపై ఏదైనా దుర్ఘటన జరిగితే దేశ ప్రజలందరూ కులాలు పక్కనపెట్టి మన ధర్మం కోసం పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. పిల్లలకి దైవభక్తి, దేశభక్తి నేర్పవలసిన అవసరం ఉన్నదన్నారు. ఏప్పుడైతే హిందూ సమాజం చైతన్యవంతంగా ఉంటుందో అప్పుడే దేశం మొత్తం సుభిక్షంగా ఉంటుందని, దేశం సుభిక్షంగా ఉంటే ప్రపంచ దేశాలన్నీ సస్యశ్యామలంగా ఉంటాయని, భారతదేశ ప్రపంచానికి విశ్వ గురువుగా ఉంటుందని అన్నారు. అనంతరం సామూహిక అన్నప్రసాద వితరణ లో అందరూ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా భారత మాత చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జాతీయ గీతాలపనతో కార్యక్రమం ముగిసింది. హిందూ సమ్మేళన సమితి కార్యక్రమం సందర్భంగా గ్రామంలో కాషాయ జెండాలు కాషాయ తోరణాలు ఏర్పాటు చేశారు.



# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**సామాన్య ప్రజల రవాణా కష్టాలను తీర్చాలి...**
**డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్, ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ కన్వీనర్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులు తమ హక్కుల సాధన కోసం చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్ డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లు పరిష్కారం కాకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజలు, విద్యార్థులు, నిరుపేదలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందుల పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వానికి మరియు ఆర్టీసీ యాజమాన్యానికి ఈ క్రింది ప్రధాన డిమాండ్లను త్వరితగతిన ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు

**ప్రధాన డిమాండ్లు**

వేతన సవరణ : 2021 నుండి పెండింగ్‌లో ఉన్న పే-రివిజన్‌ను వెంటనే అమలు చేసి, కార్మికుల ఆర్థిక ఇబ్బందులను తొలగించాలి.

**బకాయిల చెల్లింపు**

కార్మికుల కష్టార్జితమైన పీఎఫ్, సీసీఎస్ బకాయిలను వడ్డీతో సహా వెంటనే విడుదల చేయాలి.

మహాలక్ష్మి పథకం - అదనపు సౌకర్యాలు: ఉచిత ప్రయాణ పథకం వల్ల బస్సులపై పెరిగిన విపరీతమైన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేయాలి మరియు సిబ్బంది కొరతను తీర్చడానికి కొత్త రిక్రూట్‌మెంట్ చేపట్టాలి.

?ప్రభుత్వంలో విలీన ప్రక్రియ: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను కాలయాపన చేయకుండా, స్పష్టమైన గడువుతో పూర్తి చేయాలి.


**యూనియన్ ఎన్నికలు**

ప్రజాస్వామ్యబద్ధంగా కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించి, కార్మికుల గొంతుకను గౌరవించాలి.

**ప్రజల ఇబ్బందులపై స్పందన**

"సమ్మె కారణంగా బస్సులు నడవకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా ఆసుపత్రులకు వెళ్లే రోగులు, పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వాహనదారులు సామాన్యులను దోచుకుంటున్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి, కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలి. ప్రజల రవాణా హక్కును కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించబడే వరకు ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ వారికి అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్,**
**కన్వీనర్, ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్.**
**9177566741**



# నిర్మల్ జిల్లా భైంసాలో విషాదం.. ఆపరేషన్ చేస్తుండగా డాక్టర్?కు గుండెపోటు.. ప్రాణం పోయింది !

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, నిర్మల్:**
ప్రాణాలు నిలిపే వైద్యులు కూడా గుండెపోటు బాధితులుగా మిగిలిపోతున్నారు. ఒక పేషెంట్?కు ఆపరేషన్ చేస్తుండగా.. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన డాక్టర్ సురేందర్?కు గుండెపోటు వచ్చింది. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆయన భైంసాలో ప్రైవేటు ఆసుపత్రి నడుపుతున్నాడు.(బుధవారం) మధ్యాహ్నం తన ప్రైవేటు ఆసుపత్రిలో ఓ పేషంట్?కు ఆపరేషన్ చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. సిబ్బంది గమనించి నిర్మల్?లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గుండెపోటుపై ఉన్న భయాలను మరింత పెంచి




# ఆప్యాయతకు చిరునామా తోట సీతమ్మ కన్నుమూత - చిలుకోడు గ్రామంలో తీవ్ర విషాదం





**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 22, మహబూబాబాద్ ప్రతినిధి:**
డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన తోట సీతమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎవరైనా కష్టంలో ఉన్నా ముందుండి ఆదుకునే మనసు, కులమత భేదాలు చూడకుండా అందరితో కలిసిపోయే స్వభావం ఆమెను గ్రామ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం కల్పించింది. ఆమె ఆకస్మిక మరణం గ్రామస్తులను శోకసంద్రంలో ముంచెత్తింది.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసిన అనంతుల ఉపేందర్ గౌడ్‌కు సీతమ్మతో ఎంతో ఆత్మీయ సంబంధం ఉండేది. తనను కుమారుడిగా భావించిన సీతమ్మ మరణ వార్త విని ఉపేందర్ గౌడ్ తీవ్రంగా మునిగిపోయి, ఆవేదన వ్యక్తం చేశారు.అంత్యక్రియల కార్యక్రమాలను దగ్గరుండి నిర్వహించిన ఆయన, సీతమ్మతో గడిపిన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఎప్పటికీ తమతో ఉంటానని హామీ ఇచ్చారు.సీతమ్మ మరణంతో గ్రామం ఒక మానవతా విలువల ప్రతీకను కోల్పోయిందని గ్రామస్తులు బాధ వ్యక్తం చేస్తూ, ఆమె సేవలను స్మరించుకున్నారు.

# టిజిఆర్‌టిసి సమ్మె నేపథ్యంలో డ్రైవర్లకు పోలీస్ రక్షణ : ఎస్పీ నితిక పంత్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టిజిఆర్‌టిసి జెఎసి సమ్మె నేపథ్యంలో జిల్లాలో బస్సు సర్వీసులు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున ప్రైవేట్ హైర్డ్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక డ్రైవర్లకు పూర్తి పోలీస్ రక్షణ కల్పిస్తామని ఎస్పీ నితిక పంత్ స్పష్టం చేశారు.డ్రైవర్లు ఎలాంటి భయానికి గురికావాల్సిన అవసరం లేదని, వారి భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ముఖ్య కూడళ్లు, బస్‌స్టాండ్లు, సున్నిత ప్రాంతాల్లో పోలీస్ బలగాలను మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించేందుకు మొబైల్ పెట్రోలింగ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి.బస్సు సర్వీసులకు అడ్డుకట్ట వేయడం, డ్రైవర్లను బెదిరించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయ సేవలకు గౌరవం - కడెం దాసు సేవలు ఆదర్శప్రాయం : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన కడెం దాసు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ...."ఒక మంచి ఉపాధ్యాయుడు సమాజాన్ని తీర్చిదిద్దే శిల్పి, కడెం దాసు తన 36 సంవత్సరాల సేవా కాలంలో ఎన్నో తరాలను విద్యాబుద్ధులతో తీర్చిదిద్దారని, గ్రామీణ ప్రాంతంలో విద్యా అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని ఇలాంటి ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు" అని కొనియాడారు. 36 సంవత్సరాల పాటు నిరంతర సేవలందించి, విద్యార్థుల భవిష్యత్తును నిర్మించిన దాసుని ఘనంగా సన్మానించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. విద్యారంగంలో సేవ చేసిన వారికి సమాజం ఎప్పటికీ ఋణపడి ఉంటుందని, వారి సేవలను ఎల్లప్పుడూ గౌరవించాలని మల్లన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమని నాగరాజు తో పాటు గ్రామ ప్రజలు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కడెం దాసును ఘనంగా సన్మానం చేశారు

# మద్యపానానికి దూరంగా సావర్‌కేడ గ్రామం : కలెక్టర్ హరిత ప్రశంస



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్‌కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉంటున్నారని, ఇది అభినందనీయమని కలెక్టర్ కె.హరిత తెలిపారు. బుధవారం ఆ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఈ విషయం చెప్పారు.మద్యపాన వ్యసనం లేకుండా జీవించడంలో సావర్‌కేడ గ్రామానికి ఐ.ఎస్.ఓ సర్టిఫికెట్‌కు అర్హత ఉందని కలెక్టర్ వ్యాఖ్యానించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల సామర్థ్యాలు పెంచడం శ్లాఘనీయమని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సావర్‌కేడ స్ఫూర్తితో ఉపాధ్యాయులు లక్ష్యంతో పనిచేస్తే మరిన్ని పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ హరిత పేర్కొన్నారు.


# ఇంటర్ జిల్లా టాపర్లకు కలెక్టర్ హరిత సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇంటర్ 2026 ఫలితాల్లో జిల్లా టాపర్లుగా నిలిచిన 15 మంది విద్యార్థులను బుధవారం కలెక్టర్ హరిత శాలువాలతో సన్మానించారు. సమీకృత కలెక్టరేట్ భవనంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఈఓ రాందాస్ కూడా పాల్గొన్నారు. మారుమూల మండలాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల, సమిష్టి కృషి ఈ విజయానికి కారణమని తెలిపారు.– జైనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ విద్యార్థిని – 967 మార్కులు
– ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థి అఖిల్ సాయి వర ప్రసాద్ – 984 మార్కులు
– దాహేగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ విద్యార్థి ఎల్కరి సంతోష్ – 936 మార్కులు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# గిరిజన విద్యార్థులకు అంకితభావంతో సేవలందించిన ప్రధానోపాధ్యాయుడికి శాలువా సత్కారం

కనక కర్ణుకు వీడ్కోలు సన్మానం.



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** ఆసిఫాబాద్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కనక కర్ణుకు బుధవారం స్థానిక పాఠశాలలో శాలువాతో సన్మానం నిర్వహించారు.ఐటీడీఏ ఏజెన్సీ పరిధిలో మారుమూల ప్రాంతాల్లో అంకితభావంతో సేవలందించిన కనక కర్ణు సేవలను గిరిజన సంక్షేమ శాఖ మరువదని జిల్లా ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్ తెలిపారు. సహోద్యోగులతో సత్సంబంధాలు నెరిపి అందరి మన్నలు పొందారని టీఎస్టీడబ్ల్యూటీయు జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్ కొనియాడారు.కార్యక్రమంలో టీఎస్టీడబ్ల్యూటీయు ప్రధాన కార్యదర్శి నైతం కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడావి గోపాల్, జిల్లా క్రీడా అధికారి మాడావి శేఖు, కోశాధికారి కూడ్మేత ఆనంత్, సీఆర్టీ సంఘం జిల్లా అధ్యక్షులు కొమరల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి జర్పుల విజేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోడు రైతులపై అటవీ అధికారుల దాడులు ఆపాలి

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కేసీఆర్ పాలనలో పోడు పట్టాలు పొందిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశ్రయులను చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలంగాణ భవన్‌లో విమర్శించారు.2023లో కేసీఆర్ పాలనలో 4 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వగా, దాదాపు 1.5 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పట్టాలను నకిలీవని తిరస్కరిస్తోంది. మన్ననూర్ నుండి ఆసిఫాబాద్ వరకు అటవీ ప్రాంత ప్రజలను బలవంతంగా తరిమేస్తున్నారు. ఇళ్లు, మరుగుదొడ్లు, స్కూళ్లు నిర్మించుకోనివ్వడం లేదు. పొలం దున్నుకోవడానికి వెళ్తే వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారు. అటవీ అధికారులను అడిగితే సెక్షన్ 352 కింద జైలుకు పంపిస్తున్నారు. దీంతో సిర్పూర్ నియోజకవర్గంలోని మానేపల్లి, బెజ్జూర్ మండలాల రైతులు మహారాష్ట్రకు వలస పోయి కూలీలుగా మారుతున్నారు.అటవీ హక్కుల చట్టం 2006 --- కాంగ్రెస్ హయాంలోనే వచ్చింది. ఆ చట్టం సెక్షన్ 3 ప్రకారం తరతరాలుగా అడవిలో నివసించే గిరిజనులకు, గిరిజనేతరులకు భూమిపై హక్కు ఉంది. చేవెళ్ల డిక్లరేషన్‌లో అర్హులకు పోడు పట్టాలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కలిసి సమన్వయంతో పని చేయాలని, లేదంటే జాతీయ మానవ హక్కుల కమీషన్, ఎస్సీ ఎస్టీ కమీషన్‌ను ఢిల్లీలో కలుస్తామని హెచ్చరించారు.

# గుత్త సుఖేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన పద్మశాలి నాయకులు

**చేనేత పవర్ లూమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన పద్మశాలి నాయకులు బుధవారం హైదరాబాద్ లోని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని వారి స్వగృహంలో కలిసి చేనేత పవర్లూమ్స్ కార్మికుల సమస్యల గురించి వినతి పత్రం అందజేసిన, రఘునాథపురం మాజీ సర్పంచ్, యాదాద్రి జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గాడిపెల్లి శ్రవణ్ కుమార్ నేత, రాష్ట్ర యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ సామల భాస్కర్ నేత, లు పవర్ లూమ్స్ త్రిఫ్ట పథకం సమస్య గురించి చేనేత పవర్ లూమ్స్ కార్మికుల రుణమాఫీ, ఉచిత కరెంటు గురించి వినతి పత్రం అందజేసి సమస్యను వివరించడం జరిగింది. పవర్లూమ్ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట పథకం మే 2025 ముగిసింది. త్రిఫ్ట్ పథకం ముగిసి 11 నెలలు అవుతున్న ఇంకా ప్రారంభం కాలేదని త్రిఫ్ట్ పథకం ప్రారంభం చేసే విధంగా సీఎంతో చేనేత జౌళిశాఖ మంత్రి తో మాట్లాడి వెంటనే తిరిగి త్రిఫ్ట్ పథకం ప్రారంభించాలని .త్రిఫ్ట్ పథకం చేనేత కార్మికులకు 8% డిపాజిట్ చేస్తే వారి ఖాతాకు ప్రభుత్వం16% జమ చేయుచున్నది 1200 జమ చేస్తే 2400 ఇస్తుంది) అదే మాదిరిగా పవర్లూమ్ వారికి జమ చేయాలని కోరనైనది, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసింది , తమిళనాడులో మర మగ్గాలకు750 యూనిట్లు ఫ్రీ గా ఇస్తున్నారని,అదేవిధంగా మన తెలంగాణలో కూడా ప్రభుత్వం అమలు చేయాలని పవర్ లూమ్ కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించి పై సమస్యలు గురించి వెంటనే ఫోన్లో సీఎం రేవంత్ రెడ్డి, చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో ఫోన్లో వారు, మాట్లాడారు త్రిఫ్ట పథకం అతి త్వరలో ప్రారంభించే విధంగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు మరో 10 నుండి 15 రోజుల్లో త్రిఫ్ట్ పథకం ప్రారంభిస్తామని శాసనమండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి కి సీఎం తెలిపారు, ఈ సందర్భంగా వారిని చేనేత శాలువాతో ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రఘునాథపురం మాజీ సర్పంచ్, జిల్లా ఉపాధ్యక్షులు గాడిపెల్లి శ్రవణ్ కుమార్ నేత, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సామల భాస్కర్ నేత, పద్మశాలి నాయకులు లెగిసెట్టి సత్యనారాయణ లు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి పాక్ బలగాల క్రూరత్వం. బిడ్డ తల్లిని కూడా వదలకుండా..



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22 :
పాకిస్థాన్‌లో బలూచ్ పౌరుల అదృశ్యాలు మరోసారి అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా మహిళలను టార్గెట్ చేస్తూ సాగుతున్న ఈ 'అజ్ఞాత నిర్బంధాలు' ఇప్పుడు పెను సంచలనంగా మారాయి. తాజాగా కరాచీ నగరంలో అర్ధరాత్రి వేళ ఓ గృహిణి కిడ్నాప్‌కు గురైన ఉదంతం బలూచిస్తాన్ వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలకు దారి తీస్తోంది.కరాచీలోని నావల్ ఏరియాలో నివసిస్తున్న హసీనా బలూచ్ అనే మహిళను పాకిస్థాన్ బలగాలు బలవంతంగా తీసుకెళ్లినట్లు 'ది బలూచిస్తాన్ పోస్ట్' వెల్లడించింది. ఒక బిడ్డకు తల్లి, సాదాసీదా గృహిణి అయిన హసీనాను అర్ధరాత్రి వేళ ఆమె నివాసం నుంచే గుర్తు తెలియని ప్రాంతానికి తరలించారు. అప్పటి నుంచి ఆమె ఎక్కడ ఉంది? ఏ స్థితిలో ఉంది? అనే సమాచారం కుటుంబ సభ్యులకు కానీ, బయటి ప్రపంచానికి కానీ తెలియకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తిగత కిడ్నాప్ కాదని, బలూచ్ జాతిని భయభ్రాంతులకు గురిచేసే ఒక పక్కా వ్యూహమని హక్కుల నాయకులు ఆరోపిస్తున్నారు.బలూచ్ యాక్జెహ్తీ కమిటీ ప్రముఖ నేత డాక్టర్ సబీహా బలూచ్ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. బలూచ్ మహిళల అదృశ్యం అనేది ఇప్పుడు ఒక వివిక్త సంఘటన కాదని, అదొక "వ్యవస్థీకృత విధానం" గా మారిందని ఆమె ఆరోపించారు. బలూచ్ పోరాటాన్ని అణచివేయడానికి మహిళలను అడ్డుపెట్టుకుని బ్లాక్ మెయిల్ చేయడం, వారిని భయపెట్టడం పాకిస్థాన్ బలగాలకు పరిపాటిగా మారిందని ఆమె మండిపడ్డారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఇవి మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలని ఆమె గుర్తు చేశారు.

# బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజా

**గిరిజన క్రీడా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో మూడు సంవత్సరాలు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించిన కే. యువరాజా బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం గిరిజన క్రీడా ఆశ్రమ పాఠశాల సిబ్బంది శాలువా, మెమెంటోతో సన్మానించారు.పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి కలిగించిన విషయాలు గుర్తు చేసుకుంటూ పాఠశాలతో తనకున్న అనుబంధం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పవర్ లింబారావు, సీనియర్ ఉపాధ్యాయులు కూడ్మేత జంగు, టీఎస్టీడబ్ల్యూటీయు జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్, జిల్లా క్రీడా అధికారి మాడావి శేఖు, వ్యాయామ ఉపాధ్యాయులు బండ మీనారెడ్డి, గుండం లక్ష్మణ్, వసతి గృహ అధికారి సాయిబాబా, అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, కోశాధికారి కూడ్మేత ఆనంత్, సిబ్బంది అరుణ, చంపావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దహేగావ్‌లో ఎఫ్‌పీఓ శిక్షణ కార్యక్రమం

**రైతులు ఆదాయం పెంచుకోవాలంటే సంఘటితం కావాలి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22,కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగావ్ రైతు వేదికలో బుధవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలపై శిక్షణ కార్యక్రమం జరిగింది.రైతులు సమూహంగా ఏర్పడి ఎఫ్‌పీఓ ఏర్పాటు చేసుకుంటే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చు. పంటలను కలిసి అమ్మడం ద్వారా మంచి ధర పొందవచ్చు. బ్యాంకు రుణాలు, సబ్సిడీలు సులభంగా అందుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌పీఓల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఈ వ్యవసాయ అధికారి మనోహర్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఆత్మ సిబ్బంది శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# సిర్పూర్ మిల్లులో యూనియన్ ఎన్నికలు జరపాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 22, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లులో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్పను కలిసి మద్దతు కోరారు.మిల్లులో ప్రస్తుతం నడుస్తున్న పదిమంది సభ్యుల కమిటీ కార్మికులకు అన్యాయం చేస్తోందని జేఏసీ ఆరోపించింది. ఆ కమిటీని రద్దు చేసి వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేసింది. ఎన్నికలు లేకపోవడంతో కార్మికులకు తమ సమస్యలు చెప్పుకోవడానికి వేదిక కరువైందని తెలిపింది. మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప స్పందిస్తూ– కార్మికులు ఎన్నుకున్న ప్రతినిధులే యాజమాన్యంతో చర్చలు జరపాలని స్పష్టం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ఎలాంటి ఒప్పందం జరిగినా సహించేది లేదని హెచ్చరించి మద్దతు ప్రకటించారు. జేఏసీ నాయకులు – ఎన్నికలు జరిగేవరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.